


# బాధ

శ్రీమతి నాయపతి కమాలాంబజీ

అరవింద్ ఎవరితోనో మాట్లాడుతున్నాడు. వచ్చినవాళ్ళెవరో నాకు తెలీదు. వాళ్ళను నేను యిదివరకెప్పుడూ చూడలేదు.

నాకొంట్లో బాగులేదు. డాక్టరు వచ్చి చూసి వెళ్ళారు. అనారోగ్యం మాత్రం నన్ను వదలకుండా అంటిపెట్టుకుని వుంది. లేద్దామని అనుకున్నాను. నా శరీరం నాకు సహకరించడంలేదు.

అరవింద్ ముఖం దిగులుగా ఉంది. అటూ యిటూ తిరుగుతూ దేనికో హడావుడి పడిపోతున్నాడు.

"బాబూ! అరవింద్!" నెమ్మదిగా పిలిచాను. వాడు పలకలేదు.

"అరవింద్" ఈసారి కాస్త గట్టిగానే పిలిచాను. అయినా వాడు పట్టించుకోలేదు. నావైపే చూడలేదు. వాడికి వినపడలేదా? లేక నేనే మెల్లగా పిలిచానా? అర్థంకాలేదు నాకు.

"ఏవండీ!" ఈసారి మా వారిని పిలిచాను. ఆయన సోఫాలో కూర్చుని ఏదో ఆలోచిస్తున్నారు. ఆయన కూడా నా పిలుపుని పట్టించుకోలేదు.

నాకు బాధ, కోపం, ఉక్రోషం అన్నీ వచ్చేస్తున్నాయి.

ఎవరెవరో వస్తున్నారు, వెళ్తున్నారు. ఎందుకు వస్తున్నారో, ఎందుకు వెళ్ళిపోతున్నారో అంతా అయోమయంగా వుంది.

"ఈ భూమ్మీద ఎవరూ ఎల్లకాలం వుండిపోరు. ఈ రోజు ఒకరు, రేపు మరొకరు! అంతా వెళ్ళిపోవాల్సిన వాళ్ళమే" ఎవరో అంటున్నారు అరవింద్‌తో.

అరవింద్ ముఖం గంభీరంగా వుంది. వాళ్ళు అలా ఎందుకుంటున్నారో నాకు అర్థం కాలేదు. కాస్త కోపం వచ్చింది. నేను మరి వుండలేకపోయాను. కాదు, అంత విచారంగా వుండడం చూసి నా తల్లి హృదయం ద్రవించిపోతోంది. నేను మంచం మీద నుంచి మెల్లగా లేచాను. ఆశ్చర్యం! నా నొప్పులు, బాధలు అన్నీ పోయి నా శరీరం ఎంతో తేలిగ్గా హాయిగా వుంది. ఈ అనుభవం చాలా కొత్తగా వుంది. ఇంత సుఖంగా ఆరోగ్యంగా నేను ఇదివరకెప్పుడూ లేను. డాక్టరుగారు మంచి మందులు ఇచ్చినట్లున్నారు. లేచి నెమ్మదిగా అరవింద్‌ని సమీపించాను.

'అరవింద్! అరవింద్!' నేను పక్కనే నించుని గట్టిగా పిలుస్తున్నా వాడు వినిపించుకోలేదు. నాకు చాలా భయం వేసింది. నా మాట పోయి వుంటుంది. అందుకే నేను ఎంత పిలిచినా ఎవరూ వినిపించుకోవడంలేదు. అలా అనుకున్నాక నా మనసుకి కొంచెం ఊరట కలిగింది. కాని, ఆశ్చర్యం. నన్ను ఎవరో పిలుస్తున్నారు.

ఎవరు? ఎవరు? ఇంట్లోవాళ్ళు కారు. మా వారు, మా అమ్మాయి శ్యామల, అబ్బాయి

అరవింద్, అల్లుడు శేఖరం .... వీళ్ళెవరూ నన్ను పిలవడంలేదు. మరెవరో పిలుస్తున్నారు.

"రా... రా... రా... రా..." అని ఎవరో నన్ను అదే పనిగా పిలుస్తున్నారు. ఆ గొంతు చాలా సౌమ్యంగా, మృదు మధురంగా, హిప్నటైజ్ చేస్తున్నట్టుగా వుంది. నా ప్రయత్నం లేకుండానే నేను మీదకు చూశాను. ఆ పిలుపుకి నేను పరవశించి పోయాను. నేలమీద వున్న నేను గాల్లోకి లేచాను. అదెలా లేచానో నాకే ఆశ్చర్యంగా వుంది. ఆ సుమధుర స్వరం వస్తున్న వైపు వెళ్ళాను. నన్ను అలా పిలుస్తూ ముందుకు వెళ్తున్నాది ఆ స్వరం! నేను కూడా ఎవరో మంత్రించినట్టుగా ఆ స్వరం వస్తున్నవైపు వెళ్ళిపోతున్నాను. కొంత దూరం వెళ్ళాక వెలుతురు మాయమైపోయింది. చుట్టూ గాడాంధకారం. కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి. చిక్కటి చీకటి. ఆకాశంలేదు, నక్షత్రాలు లేవు, భూమి లేదు. ఏమీ లేదు. అంతా శూన్యం. చుట్టూ చూశాను. నాకు ఏమీ కనబడ్డంలేదు. అలా నడుస్తూనే వున్నాను. కళ్ళు కనబడకపోయినా, మార్గం కనబడకపోయినా!

ఆశ్చర్యంగా వుంది నాకు. భయంగా, బాధగా కూడా వుంది. ఎక్కడిదాకా వెళ్ళాలి? ఎక్కడికెళ్ళాలి? ప్రపంచమంతా శూన్యంగా, ఖాళీగా వుంది. అసలు నా గమ్యం ఏమిటో నాకే తెలీడంలేదు. నన్ను రమ్మని పిల్చిన ఆ స్వరం ఏదీ? నేను యిలా ఎంత దూరం నడవాలి? పడుతూ లేస్తూ నడుస్తూనే వున్నాను. ఇంక నడవలేను అనిపిస్తోంది. బాగా అలసిపోయాను. ఊపిరి ఆడ్డంలేదు. చాలా దూరం వచ్చేశాను. దారితప్పిన బాటసారిలా వుంది నా పరిస్థితి. ఒక్కసారిగా వేడి, ఆ ప్రాంతమంతా వేడి సెగలు, మంటల్లో చిక్కుకున్నదానిలా విలవిల్లాడి పోయాను. అంతా చీకటిగా, నిశ్శబ్దంగా, వేడిగా వుంది. దూరం నుంచి ఒక్కసారిగా సన్నని వెలుతురు కనిపించింది. చీకటి బాధ తప్పిందని సంతోషించాను. కాని అక్కడ కొన్ని భయంకర దృశ్యాలు కనిపించాయి. ఆ భయంకర దృశ్యాలు చూడగానే నా వళ్ళు జలదరించింది.

ఒక చోట పెద్ద గాడిపొయ్యి. దానిమీద చాలా పెద్ద మూకుడు. అంటే ఒక మనిషి సునాయాసంగా పట్టేటంత పెద్ద మూకుడు అది. పొయ్యి బాగా మండుతున్నది. ఆ మంటే దూరం నుంచి నాకు వెలుతురు లాగా కనిపించింది. ఆ పొయ్యిమీద మూకుడులో నూనె సలసలా మరుగుతున్నది. రాక్షసుల్లాంటి కొందరు ఆ మూకుడులో ఏవో వేయించుతున్నారు. ఏమిటి అని దగ్గరగా వెళ్ళి చూశాను. అది ఒక మనిషి

## పోలిక



గ్రేసీసింగ్ తనను మిగతా హీరోయిన్లతో పోల్చద్దు అంటోంది. దీనికి కారణం తాను వారిలాగా గ్లామరస్‌గా నటించడం నా వల్ల కాదని' చెబుతోంది. 'లగాన్' సూపర్ హిట్ అయిన దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నా, గ్రేసీ మాత్రం తరువాత మరే హిందీ చిత్రాల్లోనూ నటించలేదు. మధ్యలో రెండు తెలుగు సినిమాల్లో నటిస్తే, అవి కూడా సూపర్ హిట్ అయ్యాయి. కానీ గ్రేసీ ఒక్క హిందీలో తప్ప మరే ఇతర భాషలో సినిమాల్లో నటించడం లేదు. దీనికి కారణం ఏమిటి అంటే 'నేను మంచి ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ నుంచి వచ్చాను, కాబట్టి మిగతా హీరోయి న్లలాగా ఎక్స్‌పోజింగ్ చెయ్యడం నాకిష్టం లేదు' అన్నది. మరయితే కోంపలో కూర్చోక సినిమాల్లోకి ఎందుకు వచ్చినట్లు అంటే, సినిమాల్లో యాక్ట్ చెయ్యడం నా హాబీ. నేనేదో టాప్ హీరోయిన్ అయిపోవాలని సినిమాల్లోకి రాలేదు. జెస్ట్ యాక్టింగ్ మీద ఇంట్రెస్ట్‌తో వచ్చాను' అని వివరణ ఇచ్చింది. ఏమైనా గ్రేసీని మెచ్చుకుని తీరాల్సిందే. డబ్బు కోసం ఎలాంటి రోల్స్‌లోనైనా వెనుకాడని హీరోయిన్లున్న ఈ రోజుల్లో గ్రేసీ నిర్ణయం ఎంతైనా హర్షించదగినదే.

శరీరం. వేపుడు ముక్కలు వేయించినట్లుగా వేయించేస్తున్నారు. ఆ మనిషి అంతలా వేగిపోతూ పొలికేకలు పెడుతూ హడలెత్తించేస్తున్నాడు. అది చూడగానే బాధతో నా హృదయం సుళ్ళు తిరిగింది. మరొక చోట కొంతమంది కింకరులు పెద్ద స్తంభానికి ఒకతనిని కట్టేసి ముళ్ళ గదతో చావబాదుతున్నారు. ఆ మనిషి శరీరంలోంచి ఒక్క చుక్క రక్తం రాకపోయినా, బాధ భరించలేక వెర్రి కేకలు పెడుతున్నాడు. అక్కడ అలాంటి మూకుళ్ళు, స్తంభాలు చాలా వున్నాయి. అక్కడున్న కింకరులంతా తమ కర్తవ్య నిర్వహణలో మునిగిపోయి వున్నారు. అక్కడ శిక్షననుభవిస్తున్న వాళ్ళంతా "అమ్మా! అమ్మా!" అని హృదయ విదారకంగా ఆర్తనాదాలు పెడుతున్నా ఆ రాక్షసులు చలించడంలేదు. యంత్రాల్లా తమ పని తాము చేసుకుపోతు న్నారు. అదంతా చూస్తుంటే నా కడుపులో దేవినట్టయింది. "గోవిందా! గోవిందా!" అని అరిచాను అప్రయత్నంగానే. ఆక్కడున్న అందరూ చేస్తున్న పనిని ఆపేసి నా వైపు చిత్రంగా చూశారు. వినకూడని పదం వింటున్నట్లుగా, అయోమయంగా ముఖాలు పెట్టారు. ఆ తర్వాత మళ్ళీ తమ పనుల్లో మునిగిపోయారు. అక్కడి పరిస్థితి నాకు అర్థమయీ కానట్టుగా వుంది. ఒక్కసారి వెనక్కి తిరిగి చూశాను. ఆశ్చర్యం! నా వెనక చాలామంది వున్నారు. మమ్మల్నందరినీ వాళ్ళేం చేయబోతున్నారో నాకు అర్థమయి పోయింది. వాళ్ళని వేయించినట్టే మమ్మల్ని కూడా... ?! నేను బిగ్గరగా ఏడ్చాను. వెక్కి వెక్కి ఏడ్చాను. కాని ఎవరికీ నామీద జాలి కలగడం లేదు. అసలు 'ఎందుకు ఏడుస్తున్నావు?' అని కూడా ఎవరూ అడగడంలేదు. ఎనస్తీషియా యివ్వకుండా కన్నుకి, కడుపుకి మేజర్ ఆపరేషన్ చేస్తే ఎలా వుంటుందో ఊహించుకున్నాను. భయంతో రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ఈ విపత్కర పరిస్థితుల్లోంచి నేను అసలు తప్పించుకోలేనని నాకు పూర్తిగా అర్థమైపోయింది.

అక్కడున్న ఫస్ట్ బ్యాచ్‌ని వేయించడాలు,



## మంచి రోజులు

'మనసుంటే చాలు' చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసిన జెన్నిఫర్ ఆ సినిమా ఫ్లాప్ అవడంతో తెలుగు చిత్రాల్లో ఛాన్స్‌లు రాలేదు. తరువాత చెన్నై వెళ్ళి తమిళ చిత్రాల్లో కొన్ని ఐటమ్ డాన్స్‌లు, చిన్న చిన్న రోల్స్‌లో యాక్ట్ చేసినా దశ తిరగలేదు. ఎ.ఎమ్.రత్నం పుణ్యమా అని 'నాగ'లో సెకండ్ హీరోయిన్‌గా ఛాన్స్ కొట్టేసింది. ఈ సినిమా హిట్ అవడంతో జెన్నిఫర్‌కు మంచి రోజులు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

కొట్టడాలు పూర్తయ్యాక 'ఇంక నెక్స్ట్ ఎవరు?' అన్నట్టు చూశారు వాళ్ళు. వాళ్ళలో మొదట నేను కనిపించాను. నా గుండె జారిపోయింది. వాళ్ళు నన్ను సమీపిస్తున్నారు. దగ్గరగా వచ్చేశారు. నా చేయి పట్టుకు లాక్కెళ్తుంటే నేను రాను అన్నాను మొండిగా. వాళ్ళంతా కలిసి పెద్దపెట్టున నవ్వారు.

"ఏం ఎందుకురావు?" అన్నారు ఈడ్చుకెళ్తూనే.

"నేనేం పాపం చెయ్యలేదు. నేనెందుకు రావాలి? నేను రాను" చెప్పాను నిక్కచ్చిగా.

"ఎవరి మటుకు వాళ్ళు అలానే అనుకుంటారు నేనేం పాపం చెయ్యలేదని. నువ్వు చాలా పాపాలు చేశావు. పుట్టిన దగ్గర్నుంచి జీవితమంతా పాపాలు చేస్తూనే వున్నావు. పాపపు చింతన వుండడం కూడా పాపం క్రిందే లెక్క. తెలుసా?" అన్నారు వాళ్ళు.

"అబద్ధం, అన్యాయం. నేనెప్పుడూ అలా ఆలోచించలేదు. అసలు ఏ పాపాలు చెయ్యలేదు. నేను చాలా మంచిదానిని" అన్నాను ఉక్రోషంగా.

"ఒరేయ్! ఇది ఏ పాపం చెయ్యలేదట్రా. ఇది చెప్పేస్తే నమ్మేసి వదిలిపెట్టడానికి మనమేం వెర్రోళ్ళలాగా కనిపిస్తున్నామా దీని కళ్ళకి!?" నవ్వుకుంటున్నారు వాళ్ళు.

"పోనీ నేనేం పాపాలు చేశానో చెప్పండి! అంతేకాని న్యాయ విచారణ లేకుండా మీ యిష్టంవచ్చినట్లు శిక్షలు విధించేస్తే నేను ఊరుకోను".

"ప్రస్తుతానికి నీ పాపాల ఫైలు మా దగ్గర లేదు. జిరాక్స్ కాపీ తీసి తెస్తానని చిత్రగుప్తుడు తీసుకెళ్ళాడు. కాని నీకు ఎలాంటి శిక్షలు విధించాలో చెప్పేసి వెళ్ళిపోయాడు. కాని అతను మా బాస్‌తో చెబుతుంటే విన్నాం. నువ్వు చిన్నప్పుడు మీ అమ్మ నాన్నలని బాధ పెట్టావు. వాళ్ళు చెప్పిన మాట వినకుండా మొండిగా ప్రవర్తించి వాళ్ళను దుఃఖపెట్టుకు తిన్నావు.

"నో! నేను ఒప్పుకోను. అప్పుడు నేను చాలా చిన్నదానిని. మంచేదో చెడేదో తెలియని వయసు అది. చిన్నపిల్లలు అజ్ఞానంతో చేసిన తప్పులు తప్పులుగా పరిగణించబడవు" అన్నాను బింకంగా.

"అంటే నువ్వు పెద్దయ్యాక ఎలాంటి పాపాలు చెయ్యలేదని అనుకుంటున్నావా?"

"అవును!"

"అని నువ్వనుకుంటే సరిపోతుందా? నువ్వు పాపాలు చేశావు. నువ్వు ఏనాడూ నీ తల్లిదండ్రుల్ని లక్ష్యపెట్టలేదు. పెద్దవాళ్ళని కూడా చూడకుండా నోటికొచ్చినట్లు మాట్లాడావు. నీ మొగుడు పెద్ద ఆఫీసరని గర్వం నీకు. ఆ మిడిసిపాటుతోనే, ఆ నడమంత్రపు సిరితోనే నీ కన్న తల్లిదండ్రులు నీ కంటికి ఆనలేదు. వాళ్ళ మనసుల్ని అన్ని విధాలా గాయపరిచావు. నీ తల్లి పోయాక నీ తండ్రి ఇంటికి వస్తే ఎక్కడ పర్మనెంటుగా సెటిలైపోతాడోనని ముందే వెళ్ళగొట్టించావు. ఒకసారి నీ మీద అభిమానంతో నీ తండ్రి వంటింట్లో స్టౌ మీద గిన్నెతో వేడినీళ్ళు కాచి ఆ వేడినీళ్ళ గిన్నెను కాగితం ముక్కలతో పట్టుకుని బాత్‌రూంలో బకెట్‌లో వేద్దామని తెస్తూ వుంటే తోవలో చేయి జారి ఆ వేడినీళ్ళన్నీ క్రింద వలికిపోయాయి. అందులో కొంచెం నీళ్ళు నీ కాళ్ళమీద పడ్డాయని నీ తండ్రిని కొట్టడానికి చెయ్యెత్తావు. "మీకు కళ్ళు కనబడ్డంలేదా? కళ్ళు మూసుకుపోయాయా?" అని నీ తండ్రిమీద ఎలా అరిచావు? అది పాపం కాదా? నీ దృష్టిలో అది పాపం కాకపోవచ్చు. కాని మా దృష్టిలో అది పాపమే. అలాంటి చిన్నచిన్న పాపాలు ఎన్నో చేశావు నువ్వు. నీ భర్తని కూడా నిర్లక్ష్యం చేశావు. నీ కోపంతో, తొందరపాటుతో అహంభావంతో సంస్కారహీనంగా మాట్లాడి నీతో మాట్లాడని వాళ్ళందర్నీ చాలా నొప్పించావు. చాలా బాధ పెట్టావు".

నేను తల దించుకున్నాను. "అవన్నీ పాపాలని నాకు తెలీదు. ఏది పాపమో, ఏది పుణ్యమో తెలీకుండానే చాలామంది పాపాలు చేస్తూ కూడా తాము చేసినవి కరెక్టు అనుకుంటారు. నేను కూడా అలాంటి దానినేమో మరి!"

"అంతేకాదు! ...." వాళ్ళలో ఒకడు మొదలు పెట్టాడు.

"నువ్వు నీ భర్తను అనుమానంతో నిత్యం వేధించుకు తిన్నావు. ఏ ఆడదానితో మాట్లాడినా, వాళ్ళకి, నీ భర్తకి లేనిపోని సంబంధం అంటగట్టి మనశ్శాంతి లేకుండా చేశావు. పాపం నీ భర్త శ్రీరామచంద్రుడు. అలాంటి వ్యక్తిని పట్టుకుని మానసికంగా చిత్రహింసలకు గురిచేశావు. నువ్వు సంతోషంగా ఎప్పుడూ వుండలేదు. నీ భర్తని కూడా ఎప్పుడూ సంతోషంగా ఉండనివ్వలేదు. పాపం అతను కాబట్టి నీలాంటి దాన్ని భరించాడు..."

వాడు చెప్పిన మాటలు నన్ను ఆలోచింపజేశాయి.

నిజమేనేమో అనిపించింది.

నా ఆవేశం, అహంకారం, అనుమానం, అసూయలవల్ల ఎన్ని అనర్థాలు జరిగాయో నాకు బాగానే జ్ఞాపకం వున్నాయి. కాని ఇప్పుడు పశ్చాత్తాపపడి ఏం ప్రయోజనం?!...

"అందుకే నువ్వు నరకానికొచ్చావు..." పూర్తిచేశాడు వాడు.

"నరకమా? నేను నరకానికొచ్చానా?" నమ్మాలనిపించడం లేదు. ఇదంతా కల అనుకుంటున్నాను. కల కంటూన్నంత సేపూ ఆ కలలో మన పాత్రల్లో మనం జీవిస్తాం. కల చెదిరిపోయి కళ్ళు తెరిస్తే అప్పుడు వాస్తవం కళ్ళముందు నిలుస్తుంది. మంచికల అయితే కల చెదిరిపోయినందుకు బాధపడతాం. అదే చెడ్డ కల అయితే కలగంటూన్నంత సేపూ భయంతో ముచ్చెమటలు పోసేస్తున్నా తెలివి వచ్చాక 'హమ్మయ్య ఇది కలే కదా!' అని హాయిగా ఊపిరి పీల్చుకుంటాం. కాని ఇప్పుడు నాది కల కాదని స్పష్టంగా తెలిసిపోయింది. చుట్టూ చూశాను మరొకసారి. నిజంగా అది నరకమే. సందేహం ఏమాత్రం లేదు. వాళ్ళంతా నా వైపు వింతగా జాలిగా చూస్తున్నారు.

"మీరు చాలా అన్యాయం చేస్తున్నారు. అసలు అది పాపం అని నేను అనుకోలేదు. పాపం అని తెలిసి చెయ్యడానికి నేనంత పాపిష్ఠిదాన్ని కాదు.

## (గళ్ల) నుడి కట్టండి!

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ■ | 3 | ■ |
| | ■ | | ■ | 4 | | 5 |
| 6 | | | 7 | | ■ | |
| | ■ | ■ | | ■ | 8 | |
| ■ | 9 | ■ | 10 | | | ■ |
| 11 | | 12 | | ■ | | ■ |
| | ■ | | ■ | 13 | | |

**పజిల్ చేరవలసిన తేదీ**

**08-02-2003**

**అన్ని సమాధానాలు సరిగ్గా రాసిన వారిలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి 5 గురికి రూ. 75/- చొప్పున అందచేస్తాము**

### ఆధారాలు:

**కూర్పు : పోపూరి విశ్వనాథ్**

#### అడ్డం

1. పసివారి, ముసలివారి నవ్వు
4. అటునుంచి సంగతి
6. ఆలస్యం
8. విత్తనము
10. వీటిని చాచడమంటే తహతహ లాడడం
11. కలిసి జీవించడం బాగా లేదు
13. గాలి

#### నిలువు

1. ఒక రకం దోమకాటు వల్ల వచ్చే వ్యాధి
2. క్రింది నుంచి వచ్చే బాధ
3. సున్న లోపించిన ఒక రాశి
4. పైకొచ్చే బాగు, మేలు
5. ఆపద
7. చెదరిపోయిన అపనింద
8. విల్లు పూనినవాడు
9. ఒట్టు, ప్రమాణము
11. మితి, ఎల్ల
12. సంతానము

ఈ క్రింది కూపన్ పూర్తిచేసి దీనిని మీ జవాబుతో జతపర్చాలి.

పేరు

..........................................................

చిరునామా..........................................................

..........................................................

..........................................................

పిన్‌కోడ్ : | | | | | | |

15-01-2003 (గళ్ళ) నుడి కట్టండికి లాటరీ పద్ధతిలో ఎంపికైన విజేతలు

1. **ఎస్. సంతోష్, కాకినాడ**
2. **హెచ్. శ్రీవిద్య, గుంటూరు**
3. **పి. వసంత, బెంగుళూరు**
4. **ఎల్. శ్రేయ, హైదారాబాద్**
5. **జి. రాజారామ్, కొల్‌కతా**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| క | ట్టు | బా | టు | ■ | లు | ■ |
| ను | ■ | ట | ■ | ము | గు | డు |
| వి | ర | సా | లు | ■ | గో | ■ |
| వ్వు | ■ | రి | ■ | ధ | బా | లు |
| ■ | స్త్రీ | ■ | ఉ | ■ | ■ | కా |
| వ | ■ | లో | పా | య | కా | రి |
| మ్ము | సా | ■ | యం | ■ | ■ | అ |

అంత చిన్న తప్పుకు నన్ను నరకానికి తేవడం దారుణం, అమానుషం" ఆవేశంతో అరిచాను. మళ్ళీ అన్నాను "ఏం! మీ కళ్ళకు ఎన్నో దారుణాలు, అకృత్యాలు, మారణహోమాలు చేస్తున్న రాజకీయ నాయకులు, తీవ్రవాదులు కనబడ్డంలేదా? వాళ్ళందర్నీ వదిలేస్తున్నారు?"

"ఎందుకు కనబడ్డంలేదు? వాళ్ళంతా పెద్ద పెద్ద ఘోరమైన పాపాలు చేసినవాళ్ళు. వాళ్ళకి ఇంతకన్నా భయంకరమైన శిక్షలు వుంటాయి. ఇంతకన్నా పెద్ద నరకం మరొకటుంది. అక్కడ శిక్షలు అనుభవిస్తూ వుంటారు వాళ్ళు. ఇది దాని బ్రాంచ్!"

"పగలు, ప్రతీకారాలతో, ఈర్ష్యా ద్వేషాలతో, అసూయ, అనుమానాలతో రగిలిపోతూ దారుణ హింసాకాండలు చేసి చట్టం నుంచి తప్పించుకు తిరుగుతూ తెలివిగా, పెద్ద మనుషులుగా చెలామణి అయిపోతున్నవాళ్ళు ఇవాళ మా భూమ్మీద చాలామంది వున్నారు. కొంతమంది తన తెలివితేటలతో మీ దృష్టి నుంచి తప్పించుకు తిరుగుతున్నారు. అలాంటి వాళ్ళని వదిలేసి ఏవో చిన్నచిన్న పాపాలను చేశానని చెప్పి నాలాంటి అల్పురాలిని పట్టుకుని తెచ్చారు. ఇది మీరు నాకు చేస్తున్న అన్యాయం. అసలు మీరే పాపాలు చేస్తున్నారు. మీకు ఎలాంటి శిక్ష పడదేంటి?" నిలదీశాను. వాళ్ళు తెల్లమొహాలు వేశారు. నేను నవ్వుకున్నాను. కొంతసేపున్నాక ...


"నరకం మరీ యింత ఛండాలంగా వుండేమిటి? మీరెలా వుండగలుగుతున్నారిక్కడ? హాయిగా చదువుకోవడానికి వారపత్రికలు లేవు. రిలాక్సవడానికి ఏ.సి. రూములేవు. చూద్దామంటే 'ఈ టీ.వీ.' లేదు. ఎలాంటి ఫెసిలిటీస్ లేవు" అన్నాను విసుగ్గా. వాళ్ళంతా పెద్దపెట్టున నవ్వారు.

"మా తల్లే! పాపాలు చేసి నరకానికొస్తే ఇంకా అలాంటివన్నీ కూడానా? అలాంటి పిచ్చిపిచ్చి ఆశలు పెట్టుకోకు". ఇంతలో కొంతమంది కింకరులు పెద్ద వెడల్పాటి బ్యాట్ లాంటివి తెచ్చారు. ఒక్కొక్క బ్యాట్‌కి పొడవుగా వుండే సూదులు కనీసం వెయ్యికి పైగా వుంటాయి. వాళ్ళు నన్ను సమీపిస్తుంటే నేను భయంతో అరిచాను. "ఏం చేస్తారు?"

"నువ్వు నీకిష్టంలేని వాళ్ళందరితో సూదులు గుచ్చుతున్నట్టుగా మాట్లాడి వాళ్ళ మనసుల్ని తూట్లు పొడిచావు. అందుకే నీకీ శిక్ష. నీకిష్టమున్నా, లేకపోయినా ఎదుటివాళ్ళతో సభ్యతగా మాట్లాడాలి. కాని నువ్వు చెయ్యలేదు".

### అబ్బాయి-అమ్మాయి

మాధురీ దీక్షిత్ 'మెటర్నటీ లీవ్'లో ఉన్న విషయం తెలిసిందే. ఆమె ప్రస్తుతం సినిమాలకు బ్రేక్ నిచ్చి శ్రీవారు శ్రీరామ్‌నెనేతో కలిసి పుట్టబోయే బిడ్డను గురించి కలలు కంటోంది. మాధురీ, శ్రీరామ్ సంగతేమో కానీ, బాలీవుడ్‌లో మాత్రం మాధురీకి హీరో పుడతాడా లేక హీరోయిన్ పుడుతుందా అనే విషయంపై బుర్రలు పగలగొట్టుకుంటున్నారు. అమ్మాయే పుడుతుందని కొందరు ఖచ్చితంగా వాదిస్తున్నారు. ఎందుకంటే హీరోయిన్లకు ఎక్కువగా అమ్మాయిలే పుడతారని వారి అభిప్రాయం. దీనికొక కారణం కూడా ఉంది. శ్రీదేవి, హేమమాలిని, జూహీచావ్లా, మాలాసిన్హా, తనూజ వీరందరికీ ముందుగా ఆడపిల్లలే పుట్టారు.



"ఛ! అదేంటి! అది పాపం అని తెలిస్తే నేనెందుకలా చేస్తాను?" ఎదురు ప్రశ్న వేశాను.

"తెలిసి చేసినా తెలియక చేసినా పాపం పాపమే. తెల్సి ముట్టుకున్నా తెలియక ముట్టుకున్నా నిప్పు నిప్పే! పాపం చేస్తే శిక్ష తప్పదు. చిన్న పాపానికి చిన్న శిక్ష. పెద్ద పాపానికి పెద్ద శిక్ష. అందుకు ఇప్పుడు నువ్వు శిక్ష అనుభవించాల్సిందే!" ఇహ నా మాటకు తిరుగు లేదన్నట్టు జవాబిచ్చాడు వాడు.

సూదులతో వళ్ళంతా గుచ్చేస్తున్నారు భరింపరాని బాధ! నాకు ఏడుపు వచ్చేస్తుంది. కడుపులోంచి దుఃఖం తన్నుకు వచ్చేస్తోంది.

"వద్దు! వద్దు! చిన్న ఇంజక్షన్ ఇచ్చినా ఆ నొప్పి నేను భరించలేను. నన్నేం చేయకండి. నన్ను శిక్షించకండి. నన్ను రక్షించండి".

వాళ్ళు నా మాటలు వినడంలేదు. వాళ్ళ పని వాళ్ళు చేసుకుపోతున్నారు.

"మీరిలా చేశారంటే నేను ఇక్కడ్నుంచి క్రిందకు దూకేస్తాను" అన్నాను కోపంగా, బాధగా.

"ఏదీ దూకు చూద్దాం! నువ్వు దూకలేవు. నా డబ్బు, నా నగలు, నా చీరలు అని యిదిగా తాపత్రయపడ్డావు. అవన్నీ ఏవి? ఒక్కటంటే ఒక్కటైనా నీ వెంట తెచ్చుకోగలిగావా? ఏదీ మీతో రాదని తెలిసినా అన్నింటిమీదా విపరీతమైన మమకారం పెంచేసుకుంటారు మీ మనుష్యులు బ్రతికినన్నాళ్ళూ! చచ్చాక ఏం చెయ్యగలరు? అన్నీ వదిలేసి వచ్చేయడం తప్ప... నువ్వు ఇప్పుడు ఏమీ చేయలేవు. అరిచి గోల చెయ్యడం తప్ప!" అన్నారు వాళ్ళు సూదులు గుచ్చడం ఆపకుండానే.

నాలో పట్టుదల ప్రవేశించింది. వీళ్ళు నన్ను తక్కువ అంచనా వేస్తున్నారు. పంతంగా అక్కడ్నుంచి క్రిందకు దూకెయ్యడానికి కాళ్ళు కదుపబోయాను. కాళ్ళూ చేతులూ కదలడంలేదు. ఈ విచిత్ర పరిస్థితి చూసి నేను అయోమయంలో పడ్డాను.

"నేను మా ఇంటికి వెళ్ళిపోతాను. నన్ను వదిలిపెట్టండి" అన్నాను ఏడుస్తూ. వాళ్ళు నా వైపు పిచ్చిదాన్ని చూసినట్లు చూశారు.

"నా భర్త, నా పిల్లలు నా కోసం ఎదురు చూస్తూ వుంటారు. వాళ్ళు నా కోసం తెగ బెంగ పెట్టుకుంటారు. నేనెలాగైనా వెళ్ళిపోవాలి".

"ఎవ్వరూ నీ కోసం ఎదురు చూడరు".

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలరు?"

"ఒక్కసారి అటు చూడు!" అన్నారు వాళ్ళు.

అక్కడ స్మశానంలో ఏదో శరీరం ధహించుకుపోతోంది. ఆ శరీరం నాదేనని తెలిసే సరికి నా గుండెని ఎవరో పిండేసినట్టయింది.

"నాకు ఆలోచనలు వున్నాయి. కాని ఆకారంలేదు" అని గ్రహించడానికి ఎక్కువ సమయం పట్టలేదు.

"చూడు! నువ్వు పాపాలు చేశావు. కాని కొన్ని పుణ్యాలు కూడా చేశావు. అందుకే ఈ నరకంలో ఎక్కువ రోజులు ఉండక్కరలేదు. నీ శిక్షా కాలం పూర్తవగానే విష్ణుదూతలు వచ్చి నిన్ను స్వర్గానికి తీసుకువెళతారు. అప్పటిదాకా నువ్వు ఇక్కడ వుండాల్సిందే!" చెప్పారు వాళ్ళు.

రెండు రోజుల తర్వాత...

నా భర్త, పిల్లలు, ఇంకా కొంతమంది కలిసి హాయిగా కార్డ్స్ ఆడుకుంటున్నారు. ఇంటికొచ్చిన బంధువర్గంలోని ఆడవాళ్ళు కొందరు కాఫీలు, ఫలహారాలు ముగించి ఒకచోట చేరి చేతులు తిప్పుకుంటూ వాళ్ళమీద, వీళ్ళమీద ఏవో చెప్పుకుని వంకర నవ్వులు నవ్వుకుంటున్నారు. ఏమీ తెలియని కల్మషంలేని చిన్న పిల్లలు మాత్రం హాయిగా ఆడుకుంటున్నారు.

నా కోసం ఏడ్చేవాళ్ళుగానీ, ఒక్క కన్నీటిబొట్టు రాల్చేవాళ్ళుగానీ అక్కడ లేరు. అదంతా చూస్తుంటే దుఃఖం వరద రూపంలో బయటకు వచ్చేస్తోంది. చాలా బాధ కలుగుతోంది. సూదులు గుచ్చుతున్నదానికంటే ఎక్కువ బాధ!!??

"నేను లేను" అన్న నిజాన్ని ఇంకా జీర్ణించుకోలేక పోతున్నాను. అందుకే నా అనుభవాలను రాసి ఇలా మీ ముందుంచుతున్నాను. 'ఇదెలా సాధ్యం?' అని మాత్రం నన్నడక్కండి!

